# బాధితుడు

**ఆ**ఫీసు నుంచి బయటపడ్డాడు రంగారావు. దూరంగా చెట్టుకింద కూర్చుని సిగరెట్ తాగుతూ బాతాఖానీ వేస్తున్న డ్రైవరు యజమానిని చూసి ఉలిక్కిపడ్డాడు. పదకొండు గంటలు అయింది. ఏదీ కాని వేళ ఇపుడు బయట కొచ్చాడే ఈయన అనుకుంటూ సిగరెట్ పారేసి పరుగున వచ్చి కారు వెనక డోర్ తెరిచాడు. వద్దని వారించి తాళాలు అడిగి తీసుకున్నాడు రంగారావు. తనే డ్రైవ్ చేస్తూ ఊరి చివరికి వచ్చాడు. ఒక చెట్టు కింద కారాపి వెనక్కి వాలి కూర్చున్నాడు.

సమస్యని ఎలా పరిష్కరించుకోవాలో, ఎవరిని సహాయం అడగాలో దిక్కుతోచడం లేదు. ఏదైనా పని సహాయం అడిగితే పదిమంది పరిగెట్టుకొస్తారు. ఏ వస్తువో, వాహనమో అయితే  ఎవరైనా సహాయం చేస్తారు.

కానీ ఈ డబ్బు వ్యవహారం చాలా సున్నితమైనది. ఎవరినైనా అడగాలంటే ప్రాణం పోతుంది. నలుగురిలో ప్రచారం చేసి పరువు తీస్తారు కాబట్టి పరాయివాళ్లను అడగలేం. దగ్గర వాళ్ళనే అడగాలి.

పరిస్థితి చూస్తే చాలా క్లిష్టంగా ఉంది. అవతల వ్యవహారం ఒకటి పీకల మీదికొచ్చింది. వ్యవధి లేదు. ఏ విషయం త్వరగా తేల్చి చెప్పండి. మీరు కాదంటే వాళ్ళు మరొకర్ని చూసుకుంటారు అని చెప్పాడు మధ్యవర్తి.

ముందే పీకల్దాకా మునిగి వుంటే మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్లు ఇంత డబ్బు సర్దుకోవడం అంటే మాటలా, ఏ.సీ. కార్లో కూర్చున్నా పంచాగ్ని మధ్యలో నిలబడినట్లు ఉంది పాపం. సెల్ ఫోన్ తీసి నెంబరు కలిపాడు. నాలుగయిదు సార్లు తంటాలు పడ్డాక నంబర్ దొరికింది.

"బాబూ!"

"డాడీ మీరా? హౌ ఆర్యూ? హౌ ఈజ్ మమ్మీ" - ఆదరంగా వినిపించింది ప్రకాష్ కంఠం.

"అంతా బాగానే వున్నాం నాన్నా! మీరెలా ఉన్నారు?"

"వియ్ ఆర్ ఫైన్ డాడీ. డే టైం ఫోన్ చేశారు? ఎనీథింగ్ ఇంపార్టెంట్?"

"అవున్రా నాన్నా! నువ్వు నాకు సహాయం చెయ్యాలిరా!"

"చెప్పండి డాడీ!"

"నా కండిషన్ చాలా టైట్‌గా వుంది నాన్నా! నువ్వే ఆదుకోవాలి. నాకు కొంత డబ్బు అడ్జస్ట్ చేసి పెట్టాలి"

అవతల టోన్ మారిపోయింది.

"సారీ డాడీ! ఎక్స్‌ట్రీమ్లీ సారీ. నేనే నిండా మునిగి ఉన్నాను. నేనే మిమ్మల్ని అడుగుదాం అనుకుంటున్నాను".

ఇవతల కూడా టోన్ మారిపోయింది.

"అట్లా అనేస్తే ఎట్లారా? మీకు కావాలంటే నేనెన్నిసార్లు ఆదుకోలేదు. అన్నీ మర్చిపోయావురా!"

"లేదు డాడీ! మీరు అపార్థం చేసుకుంటున్నారు. మీరంటే నాకెంత గౌరవమో మీకు తెలియదా? ఆపదలో మిమ్మల్ని తల్చుకుని ధైర్యం తెచ్చుకుంటూ వుంటాను. నాకు చాతగానిది అడిగితే నేనేం చెయ్యగలను. నా పరిస్థితి మరీ దారుణంగా వుంది. ఎలా సర్దుకోవాలో తెలియక తలబాదుకుంటున్నాను. మీరు అనుభజ్ఞులు. నేను పిల్ల వెధవని. మీకు స్థాన బలిమివుంది. నాకు అదీ లేదు. మీరే అవస్థ పడుతుంటే నా పరిస్థితి కాస్త ఆలోచించండి".

"అంతేలేరా! అడ్డాల నాడు బిడ్డలు గాక గడ్డాలొచ్చాక బిడ్డలా అని ఊరికే అన్నారా? నేనడిగితే ఇట్లా చిలక పలుకులు పలుకుతున్నావు. మీ మామగారిని కొండలా నిలబడి ఆదుకుంటున్నావుట కదా! నాకు తెలియదనుకుంటున్నావా?" నిష్ఠూరం ఆడాడు తండ్రి.

మొహమాటంగా నవ్వేడు కొడుకు. "మామగారి విషయం వేరు కదా డాడీ. చనువుంది కాబట్టి మిమ్మల్ని కాదనగలను. ఆయన్ని ఏమైనా అంటే ఇంట్లో మనశ్శాంతి

వుంటుందా? ఏమీ అనుకోకండి డాడీ! ఇంకోసారెపుడైనా చూద్దాం. బైదిబై వచ్చే నెల్లో అమ్మ బర్త్‌డే కదా! యాభై వేలు పంపిస్తున్నాను షాపింగ్ చేసుకోమనండి".

"ఒరే ఇదేమిట్రా?" ఆక్రోశించాడు రంగారావు.

"ఎవరో వచ్చారు డాడీ! రాత్రికి ఫోన్ చేస్తాను బై" అనేసి ఫోన్ పెట్టేశాడు.

కసిగా కొడుకుని మనసారా తిట్టుకున్నాడు రంగారావు. ఫోన్ మోగింది. చూస్తే పరిచయం వున్న నంబరే. రిసీవ్ చేసుకున్నాడు.

"నేనే సార్! వాళ్ళు సరే అన్నారు. మళ్ళీ కొత్తవాళ్ళతో గొడవ ఎందుకు ఈయన చాలా మంచివారు అని చెప్పి ఒప్పించాను. మీకు వీలైతే సాయంత్రం ఎక్కడైనా కలుసుకుంటే అన్నీ సెటిల్ చేసుకోవచ్చు".

"సర్లే ఓ గంటాగి ఫోన్ చేస్తాను" అని సమాధానం చెప్పాడు రంగారావు. బుర్ర గోక్కుని కాస్త ఆలోచించి కూతురికి ఫోన్ చేశాడు. ఇంట్లోనే ఉంది అదృష్టవశాత్తు.

"నాన్నగారూ మీరా? ఎలా ఉన్నారండీ?"

"బాగానే వున్నానమ్మా. పెద్దాడు స్కూలికి వెళ్ళాడా?"

"ఆ వెళ్ళాడు నాన్నా! ఇదుగో ఈ చిన్నవాడే నానా అల్లరీ చేస్తున్నాడు. వీడు కూడా స్కూల్లో చేరితేగానీ నా కష్టాలు గట్టెక్కవు. మొన్నరాత్రి అమ్మ ఫోన్ పెట్టేశాక అరగంట సేపు ఏడిచాడు. వాడు మాట్లాడాలిట అమ్మమ్మతో!" చెప్పింది కూతురు.

"ఓరి పిడుగా! అంత పెద్దవాడయ్యాడా! మరి వెంటనే ఫోన్ చేసి మాట్లాడించక పోయావా?"

"ఆ ఊరికే పేచీ. ఫోన్ తీసుకుని ఆటలాడతాడు అంతే!"

"వాళ్ళని చూడాలని ఉంది తల్లీ. ఏమైంది మీ ప్రోగ్రాం? అల్లుడి లీవ్ శాంక్షన్ అయిందా?"

"ఆ విషయం చెప్పాలని నేనే ఫోన్ చేద్దాం అనుకుంటున్నాను నాన్నా! ఆయనికి లీవ్ శాంక్షన్ అయింది కానీ ఇంటికి అడపాదడపా వెళ్తూనే వున్నాం కదా! ఈ సారి ఇంకెక్కడికైనా వెళ్దాం అంటున్నారు నాన్నా మీ అల్లుడు".

రంగారావుకి సరదా వేసింది.

"మంచి ఆలోచన తల్లీ. అలాగే వెళ్ళండి. లక్షణంగా సింగపూర్ వెళ్ళిరండి. నేను డబ్బులిస్తాను. రేపో ఎల్లుండో పంపిస్తాను" అన్నాడు ఆహ్లాదంగా.

"అబ్బే వద్దు నాన్నా! సింగపూర్, పిల్లలు కొంచెం పెద్దవాళ్ళయ్యాక వెళ్తాం. నాన్నా మీ అల్లుడు మిమ్మల్ని ఒక సహాయం అడగమన్నారు మీకు తెలుసుగా! ఆయనకి తగని మొహమాటం!" వేడు కోలుగా.

"ఎందుకమ్మా మొహమాటం. నాకు మాత్రం మీరు గాక ఇంకెవరున్నారు? మీ కోసం కాకపోతే ఇదంతా ఇంకెవరికీ? ఏం కావాలో, ఎంత కావాలో అడుగు!" అన్నాడు లోలోపల తెగ ఆనందపడిపోతూ.

"ఏం లేదు నాన్నా! ఆ మధ్య మేము ఫామ్ హౌస్ కొన్నాం కదా!"

"అవునట. మీ అమ్మ చెప్పింది!"

"అక్కడ చెట్లన్నీ బాగా పెరిగాయి. చాలా అందంగా వుంది. ఈసారి సెలవులు అక్కడే గడుపుదాం అనుకుంటున్నాం. మీరూ అమ్మా కూడా తప్పకుండా రావాలి నాన్నా!" ఆహ్వానించింది.

"నా కెక్కడ వీలవుతుంది తల్లీ. పీకల్దాక పనులు. ఇంతకీ నీకేంకావాలో చెప్పావు కాదు!"

"ఏం లేదు నాన్నా. ఆ ఫామ్ హౌస్ నా పేరు మీద కొన్నారు. మీరు నాకు ఇచ్చినట్లు డిక్లేర్ చేశారుట. మీతో ఓ మాట చెప్పమన్నారు" గారంగా చెప్పింది.

తల మీద బాంబు పేలినట్లు అయింది రంగారావుకి.

"అదేమిటీ నేనిచ్చినట్లు చూపించడం ఏమిటి? నేనెక్కడ చూపించను. అయినా నాతో మాట మాత్రం చెప్పకుండా మీకు మీరే నిర్ణయాలు తీసుకుంటే ఎట్లాగమ్మా!"

"ఏమిటి నాన్నా – ఇంత మాత్రానికే ఇట్లా హడావిడి చేస్తున్నారు. అందరు అల్లుళ్ళలా ఆయన మిమ్మల్ని అదివ్వు ఇదివ్వు అని అడిగారా? పాపం అన్నీ ఆయనే కొనుక్కుని నీ పేరు చెప్తున్నారు. అంతేగా!"

"అది చాలదా తల్లీ నన్ను నిలువునా ముంచేందుకు. చీటికీ మాటికీ అవీ ఇవీ కొని అన్నీ మా మామగారు ఇచ్చారని టముకు వేస్తే అది నా పీకలకి చుట్టుకోదా! నేనే గంగలో దూకనమ్మా? ఎన్ని సార్లు చెప్పాను ఇట్లా నా ప్రాణాలు తోడెయ్యద్దని? ఆయనకి లేకపోతే నువ్వైనా అర్థం చేసుకోకపోతే ఎలాగే?"

"ఏమో బాబూ! ఆయన్తో ఏమైనా అంటే మామగారై వుండి అల్లుడికి ఆ మాత్రం సాయం చెయ్యలేరా అంటారు! మీతో చెప్తే మీరు ఇట్లా కోప్పడతారు. మధ్యలో నేను నలిగిపోతున్నాను. దిక్కుమాలిన ఆడజన్మ అని ఊరికే అన్నారా?"

"ఇక చాల్లే ఆపు నెత్తిన నీళ్ళకుండ రెడీగా వుంటుంది. ఏదో తంటాలు పడతాను. ఇక్కడేదో అమ్మి తగలడతాను. నా సమస్యలతో నేనేడుస్తుంటే అదనంగా ఇదొకటి. ఏం చేస్తాను? చస్తానా? అంతా నా తలరాత! ఇక ఫోన్ పెట్టేయ్".

"ఒక్క క్షణం ఆగండి. చిన్నాడు మీతో మాట్లాడతాడుట."

"ఇప్పుడు కాదులే రాత్రికి ఫోన్ చేస్తాను".

ఫోన్ డిస్కనెక్ట్ చేశాడు. తల గిర్రున తిరిగిపోతోంది. ఎటుబోయినా చుక్కెదురవడం అంటే ఇదే.

మళ్ళీ ఫోన్ మోగింది. చూస్తే ఇంటినుంచి ఒక్క క్షణం ఆగి బటన్ నొక్కాడు.

"అమ్మయ్యా! వున్నారా?"

"లేక ఎక్కడికి పోతాను? ఏమిటో చెప్పు".

"మా క్రిష్ణ మామయ్య లేడూ?"

"వున్నాడు!"

"ఆయన కొడుకు మోహన్ లేడూ"

"ఏం ఎగతాళిగా ఉందా? ఆఫీస్ టైములో ఫోన్‌చేసి వాడు లేడూ వీడు లేడూ అని ప్రశ్న లేస్తావు పిచ్చిగానీ పట్టిందా?"

"అది కాదండీ మోహను అని చెప్పానే అతను దుబాయి నుండి వచ్చాడు. అప్పుడు సన్నగా వుండేవాడా! ఇప్పుడు ఒళ్ళు చేసి గుండులా వున్నాడు. నేను గుర్తే పట్టలేదు. పాపం ఎంత ఇదైపోయాడో – వస్తూనే అడిగాడు గుత్తొంకాయ కావాలని. వండితే అమోఘం అని ముక్క మిగల్చకుండా తినేశాడు. ఎంత పొగిడాడో నా వంటని. మీరూ వున్నారు ఎందుకూ?"

"నీ సోది మండిపోనూ ఏమిటీ గోల ఇది చెప్పడానికా పని గట్టుకుని ఫోన్ చేశావు".

"కాదండీ అసలు విషయం వినండి మరి. అక్కడేదో వ్యాపారం చేస్తున్నాడుట. పట్టినదంతా బంగారం అవుతుందిట. నాకో బంగారం గొలుసు తెచ్చాడు. జెర్రిపోతులా వుందనుకోండి. ఇక్కడైతే నాలుగు గొలుసులు చేస్తారు ఆ బంగారంతో. వద్దంటే బాధపడ్డాడు. ఏదో మా నాన్నతో దెబ్బలాడి దుబాయ్ పారిపోబట్టిగానీ లేకపోతే ఇదంతా నీది అయ్యేది కాదా అని బాధపడ్డాడు. ఇంకా అందరి కళ్ళు గప్పి బిస్కెట్లు తెచ్చాడుట.

బాగా చౌకగానే వున్నాయని నేనో రెండు తీసుకున్నాను. ఎంత బాగున్నాయో చూసిన వాళ్ళంతా కుళ్ళుకుని చస్తున్నారనుకోండి".

కడుపులోంచి దుఃఖం తన్నుకొచ్చింది రంగారావుకి.

"అందరూ కలసి నన్ను కాల్చుకు తినండే. గుట్టుగా సంసారం చెయ్యాలే వెర్రి మొహమా అంటాను వింటావా? వున్న దంతా ఊరందరికీ చూపిస్తూ ఊరేగితే గానీ తోచదు నీకు".

"పోదురూ మీదంతా మరీ విచిత్రం. ఇలాంటి అపురూపమైనవి వుంటే చెప్పుకోక దాచుకుంటామా? పన్లో పని మీరు మొన్న కొన్న డైమండ్ గాజులు కూడా చూపించేశాను".

"చాల్లే నోర్మూయ్ మాట్లాడావంటే మక్కెలిరగ్గొడతాను. తెలివి తక్కువ మేళం ఎందుకు చెప్పానో అర్థం చేసుకోవేం? నా ఖర్మ కొద్దీ దొరికావు. అందరాడవాళ్ళూ నీ లాగే వున్నారా?"

"ఏమిటలా మండిపడుతున్నారు? ప్రెషరు మాత్రవేసుకోలేదా? ఎప్పుడూ ఇంతే ఆరోగ్యం సంగతి పట్టించుకోరు!"

ఆవిడ ఇంకేదో చెప్తుండగానే ఫోన్ డిస్కనెక్ట్ చేశాడు.

కోపం పట్టలేక పళ్ళు కొరుక్కున్నాడు. ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితిలో మొదట కోపం వచ్చింది. తర్వాత ఏడుపొచ్చింది!

అనావృష్టికి లోనైనవాడు బాధితుడు. అతివృష్టికి లోనైనవాడూ బాధితుడే! కరువుతో మాడిపోతూ నాలుగు నీళ్ళ చుక్కల కోసం వెదుకులాడేవాడైనా ఇంట్లో మూడడుగుల వరద నీటితో బాధపడే వరద బాధితుడిని చూసి వాడికేం బోలెడు నీళ్ళు అనుకుంటే అదేం న్యాయం? ఎవరి అవస్థ వాడిది.

పాపం రంగారావు డబ్బున్న ఇంట పుట్టాడు. దర్జాగా చదువుకున్నాడు. చదువు కాగానే డబ్బు ఖర్చుపెట్టి మంచి చోట వేయించాడు తండ్రి. రెండు చేతులా సంపాదిస్తున్న అతడికి మరో శ్రీమంతుడు నిలువెత్తు కట్నం ఇచ్చి పిల్లనిచ్చి పెళ్ళి చేశాడు. ముత్యం లాంటి కొడుకు, రత్నం లాంటి కూతురు కలిగారు. ఇద్దరూ చక్కగా చదువుకున్నారు.

తన పలుకుబడి వినియోగించి డబ్బు ధారాళంగా ముట్టచెప్పి కొడుకుకి మంచి ఉద్యోగం వేయించాడు. హోదాలోనూ, సంపాదనలోనూ తనని మించిపోయిన

కొడుకుని చూసి ఉప్పొంగిపోయాడు. తనకు సాటి అయిన ధనవంతుని కూతురికి ఇవ్వగలిగినన్ని కట్న కానుకలు ఇచ్చి తన ఇంటి కోడలుగా చేశాడు.

కూతురికి అన్నిటా తమ కంటే ఘనమైన సంబంధం చూసి చెయ్యగలగినంత డబ్బు ఖర్చు చేసి, వివాహం చేసి పంపించాడు.

అంతా బాగానే వుంది. నిత్య కళ్యాణం, పచ్చతోరణం. ఎటొచ్చీ డబ్బే ఎక్కువై ఇబ్బంది పెడుతోంది.

వరద నీటిలా, తుఫాను గాలిలా ముంచేస్తోంది.

అందులోనూ  డబ్బు మహా పాపిష్ఠిది. దాచినా దాగదు. మిగల ముగ్గిన జామపండులా, అరవిరిసిన సంపెంగ పువ్వులా దాచినా బయటికి దాని వాసన కొడుతూనే వుంటుంది. నలుగురికీ తన వునికిని చాటి చెప్తూనే వుంటుంది.

ఆ డబ్బు బాధితుడైన రంగారావుకి ఎప్పుడేం ముంచుకొస్తుందో అనే భయం పంటి నొప్పిలా బాధపెడుతూ వుంటుంది. తిండి సహించదు. నిద్ర రాదు. ఆరోగ్యం పాడైపోతోంది.

అందులోనూ రోజులు అదివరకటంత బాగాలేవు అక్కడ రైడ్ అయిందనీ ఫలానీ వాళ్ళని పట్టుకున్నారనీ విన్నప్పుడల్లా గుండె గతుక్కుమంటుంది.

అక్కడ దోపిడీ జరిగిందనీ ఇక్కడ ఇంట్లో వాళ్ళని గుండేసి కాల్చి వున్నదంతా పూడ్చుకు పోయారనీ తెలిసినప్పుడు పై ప్రాణాలు పైనే పోతాయి.

పోనీ డబ్బు ఇక చాలు అనుకోవచ్చు. కానీ అలా అనుకోటం మానవ లక్షణమే కాదు. అయినా ఈ పూట ఇంట్లో పాలున్నాయి కదా అని పాడి ఆవుని పిండకపోతే రేపీపాటికి అది కాస్తా వట్టిపోదూ!

తను సంపాదించినది భద్రపరిచి తను అడిగినప్పుడు భద్రంగా తనకి అప్పగించే అండ వుంటే ఎంత బాగుంటుంది. కాని కాగడా వేసి వెతికినా అటువంటి వాడు ఒక్కడూ లేడు. అటూ ఇటూ అందరూ తనకి తోడు పోయినవాళ్ళే.

సహాయం చెయ్యరు సరికదా మా డబ్బే కాస్త దాచిపెట్టు అని ఏడుస్తున్నారు. ఏమిటో వెధవ జీవితం. రాన్రానూ దుర్భరంగా తయారవుతోంది అనుకున్నాడు బాధగా.

ఫోన్ మోగింది. రిసీవ్ చేసుకున్నాడు.

"నేనే సార్! ఎలా వున్నారు? మన వాడొహడు ఊర్నించి వచ్చాడు. మీతో ఏదో పనుందిట. 'ఆయన నాకు బాగా పరిచయం. మరేం ఫర్వాలేదు తప్పకుండా సహాయం చేస్తారు' అని మీ తరఫున నేనే హామీ ఇచ్చేశాను. మంచి పార్టీ. లాభసాటి వ్యవహారం వీలుచూసుకొని ఒకసారి కలుసుకుందాం".

సమాధానం చెప్పి చేతుల్లో మొహం దాచుకుని దీనంగా కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు రంగారావు.

*ఫిబ్రవరి 99 రచన - ప్రతిష్ఠాత్మక జన్మదిన ప్రత్యేక సంచిక*